# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను లోక్‌సభ ఆమోదించింది.**
2. **వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.**
3. **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**
4. **ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు.**
5. **లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం-ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది.**

==========================

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు 2025ను లోక్‌సభ ఆమోదించింది. నిన్న పార్లమెంట్‌లో జరిగిన చర్చలో 288 మంది సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 232 మంది సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రకారం, గతంలో లోక్‌సభ వక్ఫ్ చట్ట సవరణ బిల్లు, 2025పై చర్చను నిర్వహించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు నిన్న మధ్యాహ్నం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లును ప్రవేశపెడుతూ, ఈ బిల్లుకు ముస్లింల మతపరమైన ఆచారాలతో సంబంధం లేదని ఇది వక్ఫ్ బోర్డులకు సంబంధించిన ఆస్తులతో మాత్రమే వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వం వక్ఫ్ బోర్డులను సమ్మిళితంగా, లౌకికంగా మార్చాలని కోరుకుంటుందని అన్నారు. ఈ చట్టం మసీదుల నిర్వహణ కోసం కాదని పేర్కొన్నారు.

ఇందులో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, వక్ఫ్ బిల్లుకు ముస్లిమ్ వర్గాల మద్దతు ఉందని అన్నారు. వక్స్ బిల్లు అంశంపై విపక్షాలు గందరగోళం సృష్టిస్తున్నాయని అన్నారు. ఈ బిల్లు అతిపెద్ద సంస్కరణగా ఆయన పేర్కొంటూ,

వాయిస్ .. 25 సెకన్లు

--------------------------

అమరావతిలో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను తీర్చిదిద్దేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ఇతర మేధావులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పలువురు పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ పై నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 వేల స్టార్టప్‌లు ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తద్వారా లక్ష మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. నూతన ఆవిష్కరణలకు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా మారాలని కావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

'అమరావతి చిత్రకళ వీధి' వంటి వేదికల ద్వారా కళాకారులు ప్రతిభను ప్రదర్శించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రేపు జరగనున్న 'అమరావతి చిత్రకళ వీధి' కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి.. ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా 'అమరావతి' ఇతివృత్తంతో రూపొందించిన చిత్రానికి ముఖ్యమంత్రి రంగులు వేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో కళాకారులను, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు ప్రోత్సహిస్తోందని అన్నారు. రాష్ట్ర కళల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళతామని పేరొన్నారు.

---------------------------

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ శాసనసభ తీసుకున్న తీర్మానానికి అనుగుణంగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ పలు బీసీ సంఘాలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులగణన చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అన్ని అన్నారు. కులగణన లెక్కలను ఫిబ్రవరి 4న చట్టసభలో ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..20 సెకన్లు

---------------------------

కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరామని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు – విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని కేంద్ర మంత్రి తెలిపినట్లు చెప్పారు. ఓర్వకల్లు పారిశ్రామిక వాడ లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విమాన సేవలు అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తలకు మరింత సౌకర్యంగా ఉంటుందనని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు. వైయస్సార్ కడప జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....

వాయిస్ ..28 సెకన్లు

---------------------------

లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం–ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. ఈ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ కోసం ఎల్‌ఆర్‌ఎస్ రుసుమును 25 శాతం రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను కొన్నిచోట్ల రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ఎన్నికలు నిర్వహించిన స్థానాల్లో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పనిచేశారని ఆయన తెలుపుతూ...

.వాయిస్... 35 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీశైల శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిన్న దర్శించుకున్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులకు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు అనంతరం మంత్రి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా శ్రీనివాసరావు చిత్రపటం, తీర్థ ప్రసాదాలను మంత్రికి అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో హస్త కళలకు మరింత ప్రాచుర్యం కల్పిస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో హస్త కళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్‌తో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిన్న మంత్రి సమక్షంలో ఒప్పందాలను చేసుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఒప్పందాల ద్వారా హస్త కళాకారులకు నూతన డిజైన్లు, సరికొత్త ఆకృతుల తయారీపై శిక్షణతో పాటు ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించనున్నామని చెప్పారు. తద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడంతో పాటు గ్రామీణ ఉపాధి అవకాశాలను, కళాకారుల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని మంత్రి తెలిపారు.

---------------------------

జనవాణి ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, వివిధ సమస్యల పై ప్రజల నుంచి వచ్చే అర్జీలను, వినతులను సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించామని మంత్రి తెలిపారు.

=====================